సిఫార్సు లేఖలకు డిమాండ్!



- ఎమ్మెల్యే కార్యాలయాల చుట్టూ సచివాలయ ఉద్యోగుల ప్రదక్షిణలు
- సచివాలయాల్లో బదిలీల ప్రక్రియ ప్రారంభం

తాడిపత్రి రూరల్: సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ మొదలైంది. దీంతో అనుకూలమైన చోట పోస్టింగ్ కోసం సచివాయల ఉద్యోగులు టీడీపీ ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి సిఫార్సు లేఖల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు ఉద్యోగులు ఆయన నుంచి సిఫార్సు లేఖలు తీసుకుని బదిలీ ప్రయత్నాలు చేసుకుంటున్నారని తెలుస్తోంది. సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ప్రొఫార్మాలో వీఐపీ రెకమెండేషన్ (మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే) పేరుతో ప్రత్యేక కాలం ఏర్పాటు చేయడంతో సిఫార్సులకు ప్రాధాన్యత ఏర్పడింది. తాడిపత్రి నియోజక వర్గంలోని తాడిపత్రి పట్టణ, రూరల్, యాడికి, పెద్దపప్పూరు, పెద్ద వడుగూరు మండలాలకు సంబంధించిన సచివాలయ ఉద్యోగులు తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, శింగనమల నియోజక వర్గంలోని పుట్లూరు, యల్లనూరు మండలాలకు చెందిన ఉద్యోగులు టీడీపీ ఎమ్మెల్యే బండారు శ్రావణి సిఫార్సుల కోసం వెంపర్లాడుతున్నారు. తాడిపత్రి నియోజక వర్గంలోని సచివాలయాలకు బదిలీపై రావాలనుకున్న వారు ఖచ్చితంగా ఎమ్మెల్యే సిఫారస్సు ఉండాల్సిందేనని అధికారులు తెగేసి చేపుతున్నారు. ఎమ్మెల్యే సిఫార్సు లేకుండా కూటమికి చెందిన మంత్రి, ఎంపీల సిఫార్సు తీసుకువచ్చినా ఫలితం ఉండదని హెచ్చరిస్తున్నారు. మిగిలిన నియోజక వర్గాల పరిస్థితి వేరు ఇక్కడి పరిస్థితులు వేరు అని చెపుతున్నారు. సరాసరి ఎమ్మెల్యే వద్దకు వెళ్లి బదిలీలపై సిఫార్సు లేఖలు తీసుకోవడానికి ధైర్యం చేయలేని పలువురు ఉద్యోగులు చోటా నాయకులు, మండల నాయకుల వెంట పడుతున్నారు. వారి ద్వారా లేఖలు తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. తాడిపత్రి పట్టణానికి చెందిన పలువురు ప్రారంభంలో అనంతపురంతోపాటు తాడిపత్రి పరిసర మండలాల్లో ఉద్యోగం పొందారు. వీరంతా తాడిపత్రికి రావడానికి ప్రయత్నాలు చేస్తూ మరోవైపు ఎమ్మెల్యే సిఫార్సు లేఖలకు ప్రయత్నిస్తున్నారు.

కోరిన చోట పోస్టింగ్ కోసం..

ఎమ్మెల్యే సిఫార్సు లేఖలు ఇప్పిస్తూ బదిలీలపై వచ్చిన ఉద్యోగులను కూటమి నాయకులు తమ చెప్పుచేతుల్లో ఉంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం ఎమ్మెల్యేల ద్వారా ఉద్యోగులకు సిఫార్సు లేఖలు ఇప్పిస్తున్నారు. కోరిన చోట పోస్టింగ్‌లు వస్తే చాలు అనుకుంటున్న ఉద్యోగులు నాయకుల మాటలకు తలాడిస్తున్నారు. కానీ భవిష్యత్తులో వారి నుంచి ప్రమాదం పొంచి ఉందని ఉద్యోగులు గ్రహించలేకపోతున్నారు. తాడిపత్రి లాంటి సమస్యాత్మక నియోజక వర్గంలో పనిచేయడం ఉద్యోగులకు ముళ్లకిరీటం లాంటిది. నాయకులు చెప్పినట్లు పనిచేయడమంటే కోరి ప్రమాదం తెచ్చుకున్నట్లే. ఈ విషయం గ్రహించని ఉద్యోగులు సిఫార్సు లేఖల ద్వారా తమ ఉద్యోగాలను ప్రమాదంలో పడేసుకుంటున్నారని మేధావులు పేర్కొంటున్నారు.

22 నుంచి రిక్వెస్టు ట్రాన్స్‌ఫర్లు

ఈనెల 22 నుంచి 24వ తేదీలోపు రిక్వెస్టు ట్రాన్స్‌ఫర్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు ఆదేశించారు. ఇప్పటికే తాడిపత్రి మునిసిపాలిటీతోపాటు తాడిపత్రి,శింగనమల నియోజక వర్గాల్లోని మండలాల్లో మే నెలాఖరులోపు ఐదేళ్ల పూర్తి చేసుకున్న సచివాలయ ఉద్యోగులు జాబితాను తయారు చేశారు. ఈ జబితాను ఉన్నతాధికారులకు పంపారు. జాబితాను అనుసరించి బదిలీలు జరుగుతుండటంతో రిక్వెస్టు ట్రాన్స్‌ఫర్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ నెల 25నుంచి 29తేదీ లోపు బదిలీలను పూర్తి చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ప్రాధాన్యత ఉద్యోగాన్ని బట్టి బదిలీలపై సిఫార్సు లేఖలకు డిమాండ్ పెరుగుతోంది.

పారదర్శకత లేని బదిలీలు

సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అధికారులు పారదర్శకతను పాటించడం లేదన్న ప్రచారం ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలు, రాజకీయ జోక్యం లేకుండా సచివాలయ ఉద్యోగుల నియామకం జరిగింది. రెండు వేలు జనాభా ఉన్న గ్రామాల్లో ఒకటి చొప్పున, మునిసిపాలిటీల్లో నాలుగు వేల జనాభాకు ఒక సచివాలయం చొప్పున ఏర్పాటు చేసి ఉద్యోగులను నియమించారు. రూ.29 వేల నుంచి రూ.31 వేలు వేతనం తీసుకుంటున్న ఉద్యోగులు సొంత మండలాల్లో పనిచేయకూడదన్న కూటమి ప్రభుత్వ ఆదేశాలు సచివాలయ సిబ్బందికి ఆవేదన కలిగిస్తోంది. కేవలం సచివాలయ ఉద్యోగులపై కక్ష సాధింపులో భాగంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని వారు వాపోతున్నారు. సాధారణంగా బదిలీలు ఆన్‌లైన్ కౌన్సెలింగ్, మెరిట్, ర్యాంకింగ్, మ్యూచ్‌వల్ పద్ధతుల్లో జరుగుతాయి. కానీ సచివాలయ ఉద్యోగుల బదిలీలు ఏ పద్ధతిని అనుసరిస్తున్నారో అధికారులు బయటకు పొక్కనీయడం లేదు.

క్లుప్తంగా

పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

శింగనమల: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధి కూలీలకు 12 వారాల నుంచి బిల్లులు పడలేదని, వెంటనే మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. శనివారం ఇన్‌చార్జి ఎంపీడీఓ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తరిమెల భాస్కర్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 12 వారాలు పాటు కూలీలు ఉపాధి హామీ పనులు చేశారని, కానీ బిల్లులు మాత్రం పడడంలేదన్నారు. బిల్లులు పడకపోతే కూలీలు ఎలా జీవించాలన్నారు. పెండింగ్ బిల్లులన్ని మంజూరు చేయాలని కోరారు. ఆదేవిధంగా కూలీలకు 200 రోజులు పని దినాలు కేటాయించాలన్నారు. రోజూ రూ.600 కూలి మంజూరు చేయాలన్నారు. పనుల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుంకన్న, రామాంజనేయులు, కొండారెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల నిరసన



మున్సిపల్ కార్యాలయం ఎదుట వంట చేస్తున్న కార్మికులు

గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేసే వరకూ పోరాటాలు కొనసాగిస్తామని కార్మిక జేఏసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, మల్లేష్ హెచ్చరించారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ శనివారం కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట వంటా వార్పు చేశారు. కార్యక్రమంలో జేఏసీ పట్టణ సహాయ కార్యదర్శి సురేంద్ర, నాయకులు మస్తాన్, లక్ష్మీనారాయణ, సుంకన్న తదితరులు పాల్గొన్నారు. కాగా కార్మికుల దీక్షలకు ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, తదితరులు సంఘీభావం తెలిపారు. అలాగే ఏఐటీయూసీ మండల కార్యదర్శి సురేష్, మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు నర్సయ్య తదితరులు మద్దతు తెలిపారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా అన్నారు. గుత్తిలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై సచివాలయ, మున్సిపల్, మెప్మా ఉద్యోగులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, మొక్కలు నాటండి అంటూ నినాదాలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించామన్నారు. పర్యావరణ పరిరక్షణ అనేది సామాజిక బాధ్యతన్నారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు , మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపప్పూరు: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గణిత శాస్త్ర అతిథి అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శంకర్‌ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెలకు రూ.27 వేల వేతనం ఇస్తామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

యోగా డే నాణేల సేకరణ



రూ100, రూ.10 నాణేలను చూపుతున్న పీసీ విష్ణు భగవాన్

యాడికి: యోగా డేకు సంబంధించిన నాణేలను సేకరించానని పీసీ విష్ణు భగవాన్ తెలిపారు. యోగా డే సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ 2005లో ప్రపంచ నాణేల సేకరణ కార్యక్రమం ప్రారంభించానన్నారు. 2015లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం యోగా డే సందర్భంగా రూ100, రూ10ల నాణేలను విడుదల చేసింది. వాటిని కూడా సేకరించానన్నారు. శనివారం యాడికిలో నిర్వహించిన యోగా దినోత్సవానికి గ్రామాలకు చెందిన పలువురు పాల్గొన్నారు. వారికి రూ100, రూ.10 నాణేలకు విష్ణు భగవాన్ చూపించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు 'డిజిటల్ కీ'

సాక్షి ఎఫెక్ట్..

తాడిపత్రి రూరల్: తాడిపత్రి ఇన్‌చార్జ్ తహసీల్దార్ సోమశేఖర్‌కు డిజిటల్ కీ ఇచ్చారు. 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన 'తహసీల్దార్ కుర్చీ ఖాళీ' కథనంపై కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ రజాక్‌వలి గుమ్మఘట్టకు బదిలీ కావడం, కొన్ని అనివార్య కారణాలతో పెద్దవడుగూరు తహసీల్దార్ ఉషారాణి తాడిపత్రిలో బాధ్యతలు తీసుకోకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించిన ఆయన సంతకంతో కూడిన డిజిటల్ కీ లేకపోవడంతో వివిధ సంతకాల కోసం కార్యాలయానికి వస్తున్న పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని సాక్షి వెలుగులోకి తీసుకురావడంతో కలెక్టర్ స్పందించి సత్వర చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మండల ప్రజలు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీఓగా తులసి ప్రసాద్



పుట్లూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఏపీఓగా తులసి ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పుట్లూరు ఏపీఓగా ఉన్న చెన్నకేశవులు ఏపీడీగా పదోన్నతిపై వెళ్లడంతో ఇన్‌చార్జ్ ఏపీఓగా నరేంద్ర బాధ్యతలు చేపట్టారు. ఏపీఓల బదిలీల్లో భాగంగా కూడేరు నుంచి తులసి ప్రసాద్ బదిలీపై పుట్లూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలందరికీ ఉపాధి పనులు కల్పిస్తామన్నారు.

సర్వేయర్‌గా మంజుల



గుంతకల్లు: మండల సర్వేయర్‌గా మంజుల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మారెప్పను గుత్తికి బదిలీ చేయగా ఆయన స్థానంలో వజ్రకరూరు మండల సర్వేయర్‌గా ఉన్న ఆమెను గుంతకల్లుకు బదిలీ చేశారు. తహసీల్దార్ రమాదేవిని మార్యదపూర్వకంగా కలసిన అనంతరం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లిలో శనివారం మల్లికార్జున అనే రైతు పాముకాటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్లికార్జున తన పొలంలో పనులు చేస్తున్న సమయంలో పాము కాటువేసింది. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మల్లికార్జునను అనంతపురానికి తరలించారు.

ఆటో, ట్రాక్టర్ ఢీ

- ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

తాడిపత్రిటౌన్: పట్టణంలో సీబీ రోడ్డు పై గాంధీనగర్ నగర్‌కు వెళ్లే క్రాస్‌లో శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బియ్యం బస్తాలతో వెళ్తున్న నంద్యాలకు చెందిన ఆటో, అక్రమ ఇసుక రవాణా చేసే తాడిపత్రి మండలంలోని కోమలి గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఢీ కొన్నాయి. ఘటనలో ఆటో ముందు భాగం నుజ్జును జైంది. డ్రైవర్ శ్రీనివాసులకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి

పామిడి: మండలంలో గతంలో 11 ఎండీయూ వాహనాలకు సంబంధించి ఆరుగురు ఎండీయూ వాహన ఆపరేటర్ల పెండింగ్ వేతనాలను వెంటనే మంజూరు చేయాలని డీ వెంకటేష్, జీ శివకృష్ణ, టీ రమేష్, ఎం మధు, క్రిష్ణ, ఎం.బాబు డిమాండ్ చేశారు. శనివారం వారు తహసీల్దార్ షర్మిలకు వినతిపత్రం సమర్పించారు. మే నెలకు సంబంధించి ఆరుగురు ఎండీయూ వాహన ఆపరేటర్లకు వేతనాలు ఇవ్వాల్సి ఉందన్నారు, తక్షణం పెండింగ్‌లో ఉన్న వేతనం మంజూరుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

యల్లనూరు: మండల కేంద్రంలోని కోట ప్రాథమిక పాఠశాలలో ఆదివారం తాడిపత్రిలోని ఏఎస్ఆర్ ఆస్పత్రి ఎండీ శ్రీనాథ్‌రెడ్డి, గైన కాలజిస్ట్ అనూషరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు.వైద్య శిబిరాన్ని మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు.

'స్థానిక' ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుస్తాం



గుంతకల్లులో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్‌కుమార్‌యాదవ్



పామిడిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గుత్తి/పామిడి: స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీచేసి గెలుస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. వైఎస్సార్ ఎపీపై గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం శుక్రవారం చేసిన వివాద స్పద వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ నాయకులు మండి పడ్డారు. గుత్తిలో శనివారం వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రెస్‌మీట్ నిర్వహించి ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలను ఖండించారు. జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్‌కుమార్‌యాదవ్, మండల మాజీ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు మధుసూదన్ రెడ్డి, గంగరాజు, పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి సీవీ రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి గురు ప్రసాద్ యాదవ్, రాష్ట్ర మైనార్టీ నాయకులు ఖాజా మైనుద్దీన్, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు మల్లి, కౌన్సిలర్లు వాల్మీకి శివ, వరద రాజులు, కేవీ రమణ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పోటీ చేయకుండా చేస్తానని, రెడ్ బుక్ తెరుస్తానని, టీడీపీలో చేరాలని ఎమ్మెల్యే వివాద స్పద వ్యాఖ్యలు చేశారన్నారు. పోటీ చేయడమే కాదు.. గెలిచి తీరుతామని దమ్ముంటే అడ్డుకోవాలని సవాల్ విసిరారు. ఇష్టానుసారం మాట్లాడితే భయపడే ప్రసక్తే లేదన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో అన్ని స్థానాల్లో , అన్ని ప్రాంతాల్లో జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచు పదవులకు పోటీ చేస్తాం.. దమ్ముటే ఆపుకో అంటూ సవాల్ విసిరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

▸▸ పామిడిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, పట్టణ కన్వీనర్ నాగూరు ఈశ్వర్‌రెడ్డి, అన్వర్‌బాషా, సాకే ఓబులేసు, రామచంద్ర తదితరులు మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్ వేయకుండా చేస్తానంటూ ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తూ టీడీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రసంగాలకు తామేమి బెదరమన్నారు. ఇసుక మాఫియా, లిక్కర్, పేకాట వంటి అక్రమార్జనలకు ఎమ్మెల్యే జయరాంకు పెట్టింది పేరన్నారు. ఎమ్మెల్యే తన తీరు మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, అనుంపల్లి సూరి, చీమల నగేష్, సుధాకర్, సల్లావుద్దాన్, శివ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'యువత పోరు' జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల భృతిని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 23న జిల్లా కేంద్రలంఓని కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న యువత పోరు ధర్నాను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో యువత పోరు కార్యక్రమ పోస్టర్లను ఆమె విడుదల చేశారు. పార్టీ యువజన విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్ మాట్లాడుతూ నిరుద్యోగులు, విద్యార్థులతో పాటు అన్ని వర్గాల వారిని నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించే యువతపోరుకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఖలీల్, ఉపాధ్యక్షుడు నవీన్, కార్యదర్శి సూర్యకిరణ్, వాలంటీర్ విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు పవన్, మాజీ సర్పంచ్ తిక్కస్వామి, యువజన నాయకులు చుక్కా సీనా, కేశవ, గోవిందు, దేవా, ఫయాజ్, ప్రశాంత్, మధు, జాఫర్, జిలాన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటికి నోటీసు



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటికి సర్వే నోటీసు అతికించిన మునిసిపల్ సిబ్బంది

తాడిపత్రి రూరల్: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటికి శనివారం మునిసిపల్ సిబ్బంది నోటీసు జారీ చేశారు. ఇంట్లో ఎవరు లేకపోవడంతో నోటీసును గోడకు అతికించారు. ఏ మేరకు మునిసిపల్ స్థలాన్ని ఆక్రమించి ఇంటిని నిర్మించారో? లేదో? తెలుసుకునేందుకు ఈ నెల 28న ఉదయం 11గంటలకు సర్వే చేయనున్నామని అందులో పేర్కొన్నారు. సర్వే నెంబర్ 639, 640, 641లోని ఎల్‌పీ నెంబర్ 152–83లోని ప్లాట్ నెంబర్ 1నుంచి 16 వరకూ 0.10 ఎకరాల మునిసిపల్ స్థలాన్ని అక్రమించారన్న ఆరోపణలపై హద్దులు నిర్ణయించేందుకు మాజీ ఎమ్మెల్యేతోపాటు 10 మందికి నోటీసులను జారీ చేశారు. సర్వే దృష్ట్యా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సిబ్బందికి భద్రత కల్పించాలంటూ పట్టణ పోలీసులకు అధికారులు వినతి పత్రం అందజేశారు. కలెక్టర్‌తోపాటు తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయానికి కూడా సర్వే సమాచార వివరాలను అందజేశారు.

యోగాతో మానసిక ప్రశాంతత



గుంతకల్లులోని రైల్వే క్రీడా మైదానంలో ఆసనాలు వేస్తున్న డీఆర్‌ఎం సీఎస్ గుప్తా, జడ్జి మంజుల



తాడిపత్రిలోని కోర్టు ఆవరణలో ఆసనాలు వేస్తున్న మెజిస్ట్రేట్ అనిల్‌కుమార్

గుంతకల్లు,తాడిపత్రి,శింగనమల సాక్షి నెట్‌వర్క్: శారీరక, మానసిక ఒత్తిడి నివారణకు దివ్య ఔషధంగా యోగా పని చేస్తుందని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. శనివారం స్థానిక రైల్వే క్రీడా మైదానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌ఎంతోపాటు రైల్వే, రెవెన్యూ, మున్సిపల్ తదితర విభాగాల అధికారులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా సాధనతో ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎంతోపాటు ఏడీఆర్‌ఎం సుధాకర్, జడ్జి మంజుల మున్సిపల్ చైర్‌పరన్ ఎన్.భవానీ, ఆర్‌డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రమాదేవి, మున్సిపల్ కమీషనర్ నయీమ్ అహ్మద్ తదితరులు యోగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ యోగా చేస్తున్నట్లు వేసిన బొమ్మను చూసి ప్రముఖ ఆర్టిస్ట్ శ్రీధర్‌ను డీఆర్‌ఎం అభినందిచారు. అదేవిధంగా గుంతకల్లు కోర్టు ఆవరణలో గుంతకల్లు జూనియర్ సివిల్ జడ్జి మంజుల, ఉరవకొండ కోర్టు జడ్జి దుర్గా కళ్యాణి, కోర్టు అధికారులు, న్యాయవాదులు యోగాసనాలు వేశారు. అలాగే తాడిపత్రి పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో మెజిస్ట్రేట్ అనిల్‌కుమార్ పాల్గొని ఆసనాలు వేశారు. తాడిపత్రి పట్టణంలోని పెన్నానది ఒడ్డున వున్న జాయ్ పార్కులో పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు యోగా కార్యక్రమం నిర్వహించారు. గుత్తిలోని గేట్స్ కళాశాలలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ఎండీ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, యాడికి, గుంతకల్లు, గుత్తి, పామిడి, శింగనమల, గార్లదిన్నె, పుట్లూరు, యల్లనూరు, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోలు, విద్యాలయాల్లో యోగాసనాలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఏపీఓలు, ఏపీఎంలు, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది, యోగా గురువులు, ప్రజలు పాల్గొన్నారు.



గుంతకల్లులో యోగాసనాలు చేస్తున్న జడ్జిలు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది



గుత్తిలోని గేట్స్ కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థినులు

'టౌన్ బ్యాంకులో అక్రమాలు జరగలేదు'

గుత్తి: 'మా బ్యాంకులో ఎలాంటి అక్రమాలు జరగలేదు. ఎవరూ లంచాలు తీసుకోలేదు. షెక్షావలి అనే వ్యక్తి నిరాధారణమైన ఆరోపణలు చేశారు. అక్రమాలు జరిగినట్లు ఆధారాలు చూపకపోతే వారం రోజుల్లో పరువు నష్టం దావా వేస్తాం' అని గుత్తి టౌన్ బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్ అన్నారు. గుత్తి టౌన్ బ్యాంకులో శనివారం ఆయన డైరెక్టర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. షెక్షావలి అనే వ్యక్తి బ్యాంకును బదలాం చేయాలని నిరాధారణమైన ఆరోపణలు చేశారన్నారు. ప్రొఫెషనల్ డైరెక్టర్‌గా ఖాజా గత నెల 30నే రాజీనామా చేశారన్నారు. ఆర్‌బీఐ తొలగించిందని ఆయన ఆరోపించారన్నారు. వారంలోగా ఆధారాలు చూపకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షులు రాము, డైరెక్టర్లు మధు, ఎంపీ మహేష్ కుమార్, రంగ ప్రసాద్ రాయల్, కృష్ణ, మాబు, దాదా, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో చైన్‌స్నాచింగ్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయ సమీపంలో శనివారం వాకింగ్ చేస్తున్న మహిళ మెడలో చైన్‌ను దుండగుడు లాక్కెళ్లారు. సంజీవనగర్ కాలనీకి చెందిన కాంతమ్మ వాకింగ్ చేస్తుండగా అటుగా వచ్చిన దుండగుడు ఆమె మెడలోని 3 తులాల చైన్‌ను లాక్కొని రైల్వేట్రాక్ వైపు పారిపోయాడు. ఆమె ఫిర్యాదు మేరకు సీఐ శివగంగాధర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. కాగా ఈ నెల 19న పట్టణంలోని టైలర్స్ కాలనీలో ద్విచక్ర వాహనంపై వచ్చి చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన సంఘటన తెలిసిందే. రెండు రోజుల తేడాతో పట్టణంలో రెండు చైన్ స్నాచింగ్‌లు జరగడంతో మహిళలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

గుత్తి: పట్టణంలోని ఎండీఓ కార్యాలయం సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో రాము, సునీత దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. గుంతకల్లు మండలం వైటీ చెరువు గ్రామానికి చెందిన వారు బైక్‌లో గుత్తికి వచ్చారు. ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీ కొనింది. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పెద్దపప్పూరు: మండలంలోని పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తు్న రెండు ట్రాక్టర్లను శనివారం స్పెసల్ శ్యాండ్ టీమ్ పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. గార్లదిన్నె గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. మండల వ్యాప్తంగా ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ రామసుబ్బయ్య హెచ్చరించారు.

స్కూటర్ స్టాండ్‌గా కూరగాయల మార్కెట్



కూరగాయల మార్కెట్‌లో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసిన దృశ్యం

పామిడి: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో నిర్మించిన కూరగాయల మార్కెట్ కాస్తా స్కూటర్‌స్టాండ్‌గా మారింది. సాధారణ పంచాయతీ నిధుల కింద రూ.25లక్షలతో గత ఫిబ్రవరి 17న గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఎంతో ఆర్భాటంగా మార్కెట్‌యార్డును ప్రారంభించారు. మొదట్లో మార్కెట్‌లో కొన్ని తోపుడు బండ్లు ఏర్పాటు చేసినా.. వ్యాపారాలు లేక తిరిగి తోపుడుబండ్లన్నీ రోడ్డెక్కాయి. దీంతో ఆ కూరగాయల మార్కెట్ ప్రస్తుతం ద్విచక్రవాహన స్టాండ్‌గా మారింది. పామిడికి పనిమీద వచ్చే గ్రామీణులు తమ వాహనాలను మార్కెట్‌లో నిలుపుతున్నారు. దీంతో కూరగాయల మార్కెట్‌కు నిమిత్తం వినియోగించిన రూ.25 లక్షలు ప్రజాధనం నిధులు నీట్లో పోసినట్టైదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.